ఈనాడు సిద్దిపేట
మంగళవారం సెప్టెంబరు 1, 2026 5

మెరుగైన సౌకర్యాలు.. సాఫీగా నిర్వహణ

తరగతి గదిలో జూనియర్ కళాశాల విద్యార్థినులు

జూనియర్ కళాశాలలకు సమగ్ర శిక్షా నిధులు

న్యూస్‌టుడే, సిద్దిపేట: ఇంటర్ విద్యా వ్యవస్థ బలోపేతానికి అడుగులు పడుతున్నాయి. సమగ్ర శిక్షా కింద వివిధ రూపాల్లో నిధులు కేటాయిస్తూ సౌకర్యాల మెరుగుకు దృష్టి సారించింది. మౌలిక వసతులు, నిర్వహణకు వివిధ వారీగా చర్యలు చేపట్టారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రథమ సంవత్సర విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ప్రారంభించనున్న విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగా సర్కారు జూనియర్ కళాశాలల ప్రయోగశాలల్లో సదుపాయాలకోసం విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.24-60 వేల వరకు కేటాయించారు. మొత్తం 20 కళాశాలలకు రూ.10.08 లక్షలు నిధులు విడుదలయ్యాయి. వీటితో కనీస వసతులు కల్పించనున్నారు. నైపుణ్య విద్య కింద సిద్దిపేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు రూ.50 వేలు మంజూరయ్యాయి. ఫ్యాషన్ డిజైనింగ్, హెల్త్ కేర్ సర్టిఫికెట్ కోర్సుల్లో విద్యార్థినులకు శిక్షణ ఇవ్వనున్నారు. సదుపాయాలు కల్పించనున్నారు. ఇక్కడ 550 మంది బాలికలు చదువుతున్నారు.

20 కళాశాలలు.. రూ.12 లక్షలు..

కళాశాలల నిర్వహణలో భాగంగా నిధులు కేటాయించారు. 2026-27 విద్యా సంవత్సరానికి 20 కళాశాలలకు రూ.12 లక్షలు విడుదలయ్యాయి. విద్యార్థులు 1-30 మంది ఉంటే కళాశాలకు రూ.10 వేలు, 31-100 మంది రూ.25 వేలు, 101-250 వరకు రూ.50 వేలు, 251-1000 వరకు రూ.75 వేలు, ఆపై ఉంటే రూ.లక్ష వరకు కేటాయించారు. వీటితో మౌలిక వసతుల కల్పన, సామగ్రి కొనుగోలు చేయనున్నారు. గతంతో పోల్చితే ప్రథమ సంవత్సరంలో 500 మందికి పైగా విద్యార్థుల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం ప్రథమ, ద్వితీయంలో 6,275 మంది చదువుతున్నారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బడుగు జీవి బడ్జెట్‌లో మార్పు!

పెరిగిన నిత్యావసరాల ధరలతో కుదేలు

• సిద్దిపేటకు చెందిన రాజు కుటుంబంలో మొత్తం నలుగురు సభ్యులు. ఓ దుకాణంలో పని చేస్తుండగా.. నెలకు రూ.12 వేల వరకు వేతనం పొందుతున్నారు. ఆ మొత్తం నుంచే నిత్యావసరాల కొనుగోలు సహా ఇద్దరు పిల్లల చదువుకు వెచ్చించాల్సిన పరిస్థితి. దాదాపు తొమ్మిది నెలల కింద వరకు ప్రణాళికతో నెట్టుకొచ్చారు. కొన్నాళ్లుగా నిత్యావసరాల ధరలు పెరిగిన పరిస్థితుల్లో నెల బడ్జెట్‌కు అదనంగా రూ.3 వేలు అవసరమవుతున్నాయి. వారానికోసారి తినే మాంసాన్ని 15 రోజులకోసారి తింటుతున్నారు.

న్యూస్‌టుడే, సిద్దిపేట, ధూల్మిట్ట, మెదక్, సంగారెడ్డి అర్బన్, వికారాబాద్ కలెక్టరేట్

రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసరాల ధరలు సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో వణుకు పుట్టిస్తున్నాయి. ప్రతి నెలా బడ్జెట్ లెక్కలు మారుతున్న తీరు బడుగు జీవులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఖర్చులు తగ్గించుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. వినోదాలు, యాత్రలను వాయిదా వేస్తున్నారు. ఉన్నంతలో సర్దుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.

సాగు జీవనాధారం..

సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో మెజార్టీ శాతం జనాభాకు వ్యవసాయమే ప్రధాన వృత్తి. పేద, మధ్య తరగతి కుటుంబాల శాతం ఎక్కువే. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తక్కువ. పంట ఉత్పత్తులపై జీవించే వారు అనేకం. ఎల్‌నినో పరిస్థితుల్లో సాగు రంగం ఆశాజనకంగా లేదు. ఆశించిన మేర సీజన్ లేని పరిస్థితుల్లో పలువురు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఇదే క్రమంలో పెరుగుతున్న ధరలు ఒకింత తలనొప్పిగా మారాయి. వివిధ రకాల ధరల పెంపుతో అల్పాహారం, భోజనం, చిరుతిళ్లు, ప్రైవేటు వాహనాల చార్జీల్లో పెరుగుదల స్పష్టమవుతోంది.

నాలుగు జిల్లాల వివరాలు లక్షల్లో..

జిల్లా	జనాభా	కుటుంబాలు	గ్యాస్ వినియోగదారులు	వాహనాలు
సిద్దిపేట	10.12	2.50	3.31	3.87
మెదక్	7.67	2.19	2.35	1.33
సంగారెడ్డి	15.27	4.10	6.10	3.67
వికారాబాద్	12.50	1.97	2.08	2.08

రూ.2 నుంచి రూ.3 వేలు అదనంగా..

దాదాపు తొమ్మిది నెలల్లో నిత్యావసరాల ధరలు 20 నుంచి 40 శాతం వరకు పెరిగినట్లు స్పష్టమవుతోంది. పేద, మధ్య తరగతి కుటుంబాలపై సగటున రూ.2 వేల నుంచి రూ.3 వేలు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. మాంసం, కూరగాయల ధరల్లోనూ వ్యత్యాసం కనిపిస్తోంది. దీంతో పలువురు ఖర్చులు తగ్గించేందుకు దృష్టి సారించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలు, దినసరి వేతనంపై పని చేసే వారు తర్జనభర్జనకు గురవుతున్నారు.

ధరల్లో మార్పు ఇలా.. (కిలో.. రూ..లలో)

విభాగం	9 నెలల క్రితం	ప్రస్తుతం
వంటగ్యాస్	923.50	1012.50
కారం	300	420
వంట నూనె	148	180
కందిపప్పు	120	135
పాలు(లీటరు)	80	84
చక్కెర	44	60
పెట్రోల్ (లీటరు)	107.71	115.94
డీజిల్ (లీటరు)	95.93	104.05
మటన్ (కిలో)	800	900
కోడిగుడ్లు (30)	150	189

ప్రాధాన్య క్రమం చూడాలి..

ధరలు పెరగడానికి అనేక కారణాలు ఉంటాయి. అవసరం, కోరిక మధ్య తేడాను గుర్తించాలి. ఇంట్లో అందరూ పొదుపును అలవర్చుకోవాలి. వృథా ప్రయాణాలు, వాహన వినియోగం తగ్గించుకోవాలి. కొన్ని వాడకాల్లో మెలకువలు పాటించాలి. ప్రాధాన్య క్రమంలో జాబితాలు రూపొందించుకొని అనుసరించాలి. ఇదే క్రమంలో ఆరోగ్యం, అత్యవసర అంశాల్లో వెనకడుగు వేయొద్దు. ఆదాయం పెరిగే పరిస్థితులు లేని దృష్ట్యా ఖర్చులు తగ్గించుకోవాలి. చిన్నపాటి పెట్టుబడుల ద్వారా ఆర్థిక వృద్ధి సాధించవచ్చు.

–ప్రొఫెసర్ కె.భవాని, ఆర్థిక విశ్లేషకురాలు, దుబ్బాక

ఇల్లు గడవడం కష్టమవుతోంది: పద్మ, లింగాపూర్ (ధూల్మిట్ట)

నూనెలు, వంట సామగ్రి ధరలు పెరగడంతో ఇల్లు గడవడం కష్టంగా మారింది. కొన్నాళ్లుగా పొదుపు మరింత పెరిగింది. కట్టెల పొయ్యి వాడకం పెంచాల్సి వస్తోంది. గతంలో రూ.3 వేల వరకు ఖర్చయ్యేది. ఇప్పుడు రూ.4,500 వరకు అవుతోంది. వర్షాలు లేక పంటలు లేవు. ధరలను సామాన్యులకు అందుబాటులోకి తేవాలి.

సీఎంఆర్ వసూళ్లకు.. ప్రత్యేక కార్యాచరణ

ఈనాడు, సంగారెడ్డి: ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్ కోసం మిల్లులకు ఇచ్చిన ధాన్యాన్ని పక్కదారి పట్టించిన మిల్లర్లపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. మూడు జిల్లాల్లో 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించి వేలం వేసిన ధాన్యంతో పాటు సీఎంఆర్ బకాయిలను వసూలు చేసేందుకు ఆర్‌అండ్‌ఆర్ చట్టాన్ని ప్రయోగించనున్నారు. సిద్దిపేట జిల్లాలో పదిమంది మిల్లర్లను ఇందుకు ఎంపిక చేశారు. మెదక్ జిల్లాలో ధాన్యం వేలానికి సంబంధించి రూ.195 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.70కోట్లు చెల్లించారు. మరో రూ.125 కోట్లు చెల్లించాల్సి ఉంది. మూడేళ్లుగా వీటిని చెల్లించకుండా రాజకీయ నాయకుల అండదండలతో తప్పించుకుంటున్నారు. వీరితోపాటు, బహిరంగ విపణిలో విక్రయించి సొమ్ముచేసుకున్న వారిపై దృష్టిపెట్టారు.

తనిఖీలతో వెలుగులోకి అక్రమాలు:

ఉమ్మడి జిల్లాలోని మిల్లర్లు సీఎంఆర్ ధాన్యాన్ని మరాడించకుండా అక్రమాలకు పాల్పడ్డారు. ఈ దందాను పసిగట్టి విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టడంతో, అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం వేలంతోపాటు, గత మూడు సీజన్ల ధాన్యం మరాడించకుండా కొందరు మిల్లర్లు బహిరంగ విపణిలో విక్రయించినట్లు నిర్ధారణ జరిగింది.

అక్రమార్కులపై ఈడీ దృష్టి:

అన్నదాతల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లు విక్రయించారు. వచ్చిన సొమ్ముతో స్థిరాస్తి, ఇతర దందాల్లో పెట్టుబడి పెట్టి ఆర్జించినట్లు తెలుస్తోంది. ఇటువంటి వారికి ఈడీ నోటీసులు జారీచేస్తోంది. మెదక్ జిల్లాలో కొందరు మిల్లర్లు పెద్దఎత్తున బకాయిలు చెల్లించాల్సిఉంది. జిల్లాకు చెందిన 22 మంది మిల్లర్లు నగదు చెల్లించకుండా కోర్టు మెట్లెక్కారు. దీంతో ఆగ్రహించిన ప్రభుత్వం వీరిపై నిఘా పెట్టినట్లు తెలుస్తోంది.

తహసీల్దార్ల ద్వారా..:

2011-12 నుంచి సీఎంఆర్ బకాయి పడ్డ మిల్లర్లకు ఆర్ఆర్ చట్టం ప్రకారం కలెక్టర్ల నేతృత్వంలో తహసీల్దార్ల ద్వారా నోటీసులు జారీచేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో రూ.20 కోట్లకు సంబంధించి పది మిల్లులు, మెదక్ జిల్లాలోని మిల్లులు, సంగారెడ్డి జిల్లాలోని నాలుగు మిల్లులకు నోటీసులు జారీచేశారు. వారికి ఆస్తులను ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్లు చేయవద్దని ఆదేశాలు జారీచేశారు. నిబంధనల ప్రకారం ఆగస్టు 31లోగా మిల్లర్లు బకాయిలో 50శాతం చెల్లించకుంటే చర్యలు తీసుకుంటామని ఇప్పటికే నోటీసులు ఇచ్చారు. అయినా పలువురు ససేమిరా అంటున్నారు. దీంతో పెద్దఎత్తున మిల్లర్లకు రికవరీ చట్టం నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉంది.

ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నా..: మంత్రి

హుస్నాబాద్, హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్ (విద్యా కేంద్రం)గా తీర్చిదిద్దుతున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్‌లో రూ.14.56 కోట్ల వ్యయంతో చేపట్టనున్న శాతవాహన విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల బాలుర, బాలికల వసతి గృహ నిర్మాణాలకు మంత్రి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మట్లాడారు. 'ఈ కళాశాలలో 240 మంది విద్యార్థులు ఉన్నారు. మారుతున్న కాలానుగుణంగా కొత్త కోర్సులు తీసుకువస్తాం. హుస్నాబాద్‌లో ఏటీసీ, నాక్ సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. కోహెడలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణంలో ఉంది. సైదాపూర్, చిగురుమామిడి, భీమదేవరపల్లి, ఎల్కతుర్తిలో ఒక్కోచోట తెలంగాణ పబ్లిక్ స్కూల్, నవోదయ, ట్రిపుల్ ఐటీ రానున్నాయి. హుస్నాబాద్‌కు కబడ్డీ అకాడమీ, మరో స్టేడియం నిర్మాణం చేపట్టబోతున్నాం.' వర్సిటీ పాలకమండలి సభ్యురాలు బొలిశెట్టి రజిత, పురపాలిక అధ్యక్షురాలు దండి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో ఇంజినీరింగు కళాశాల వసతి గృహాలకు భూమి పూజ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వీసీ తదితరులు

• కొత్త మండలాల ఏర్పాటు ప్రక్రియ చేపట్టి కొత్తకొండ మండలం ఏర్పడితే కన్నారం గ్రామాన్ని ఆ మండలంలో కలుపుతామని మంత్రి తెలిపారు. అక్కన్నపేట మండలం కన్నారంలో పల్లెపల్లెకు పొన్నమన్న కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా కన్నారం గ్రామానికి సాగునీరందించే అవకాశాలను పరిశీలిస్తామన్నారు.

• కట్కూర్, దుబ్బతండా, దాసుతండా, చాపగానితండా, కన్నారం, పంతులుతండా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. 'త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గౌరవెల్లి ప్రాజెక్టును సందర్శిస్తారు. కట్కూర్‌కు ఆర్టీసీ బస్సులు పెంచుతాం. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల ప్రజా పాలనపై నిరసన కార్యక్రమాలు చేపట్టే భారాస నాయకులను ప్రజలంతా నిలదీయాలి. ఉనికి కాపాడుకునేందుకే భారాస నిరసనలు చేపడుతోంది' అని విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. ఉపకులపతి ఉమేశ్‌కుమార్, ప్రిన్సిపల్ తిరుపతిరెడ్డి, డీఆర్డీవో రమేశ్ కుమార్, వ్యవసాయ, ఉద్యాన, రెడ్కో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

• సిద్దిపేటలోనీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో గౌరవెల్లి రిజర్వాయరు కాలువల భూసేకరణపై, హుస్నాబాద్-కొత్తపల్లి రహదారి, ఇంజినీరింగ్ కళాశాల పనులపై మంత్రి సమీక్షించారు. కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు.

మా హయాంలో వ్యవసాయానికి ఇబ్బందులు రాలేదు

మాజీ మంత్రి హరీశ్‌రావు

మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: కేసీఆర్ పాలనలో వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బందులు రానివ్వలేదని.. కాంగ్రెస్ పాలనలో రైతులు అష్టకష్టాలు పడాల్సి వస్తోందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట గ్రామీణ మండలం రాంపూర్‌లో సోమవారం నూతనంగా నిర్మించిన శ్రీహనుమాన్ దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 14 నుంచి రైతు బీమా నిలిచిపోయిందని రైతుబంధు సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ వస్తేనే ప్రజలకు, రైతులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలియజేశారు.

• రాష్ట్రంలో పాఠశాలలు ప్రారంభమై 3 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు నేటికీ ఏకరూప దుస్తులు ఇవ్వలేదన్నారు. సిద్దిపేట పట్టణం న్యూ ఉన్నత పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వస్త్రాల కాంట్రాక్టును గుజరాత్‌కు చెందిన మఫత్‌లాల్ అనే కంపెనీకి కట్టబెట్టారని ఆ కంపెనీ వస్త్రాలు ఎప్పుడొస్తాయో పిల్లలకు ఎప్పుడు కుట్టిస్తారో తెలియని దయనీయ పరిస్థితి ఉందన్నారు. పదో తరగతిలో పాఠశాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు సొంత డబ్బుతో ఐప్యాడ్లు బహుమతిగా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. మెరిడియన్ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంటుకు ఆయన హాజరయ్యారు. విద్యార్థులు ఫోన్లు పక్కన పెట్టి ఆటల్లో రాణించాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్లు దేవేందర్‌రెడ్డి, రాజావెంకట్‌రెడ్డి, ప్రిన్సిపల్ రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ నిషేధం గాలికి..

సిద్దిపేటలో కొరవడిన నియంత్రణ

న్యూస్‌టుడే, సిద్దిపేట: అల్పాహారం, కూరగాయలు, పండ్లు, మాంసం.. దుకాణం, ఉత్పత్తి ఏదైనా.. ప్లాస్టిక్ కవర్లు సర్వసాధారణంగా మారాయి. ఒకప్పుడు కట్టడిలో ఆదర్శ పథాన పయనించిన సిద్దిపేట బల్దియా.. పటిష్ఠ పర్యవేక్షణ కొరవడి వెనుకబడుతోంది. పట్టణ శివారుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుంటున్నాయి. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు పర్యావరణానికి నష్టం కలిగిస్తాయి. ఆరు నెలల్లో కవర్లు విక్రయించిన, ఉత్పత్తుల విక్రయానికి వినియోగించిన 35 మందికి బల్దియా అధికారులు జరిమానా విధించారు. 40 కేజీలు నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఒక కేసు నమోదైంది. ఎన్‌ఫోర్సుమెంట్ బృందం నేతృత్వంలో ప్రత్యేక కార్యాచరణ కొరవడుతోంది.

సిద్దిపేటం సమీకృత మార్కెట్‌లో కవర్లలో కూరగాయలు

సిద్దిపేటలో వార్డులు: 43
జనాభా: 1.57 లక్షలు
రోజులో ప్లాస్టిక్ వ్యర్థాలు: 5 మెట్రిక్ టన్నులు
స్టీల్ బ్యాంకులు: 34

నామమాత్రంగా స్టీల్ బ్యాంకులు

సమీకృత మార్కెట్, రైతుబజారులో నిషేధం అని రాసి ఉన్నా.. ఆ కవర్లలోనే ఉత్పత్తులను తెచ్చి విక్రయిస్తున్నారు. పండ్ల విక్రేతలు, మాంసం, టిఫిన్ సెంటర్లు, వివిధ రకాల చిరుతిళ్ల దుకాణాల నిర్వాహకులు సైతం యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. 120 మైక్రాన్స్, ఆపై మందం కలిగిన ప్లాస్టిక్ ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలనేది నిబంధన. ఏళ్ల కిందటే పాత వార్డుల్లో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేసినా కనీసం 10 శాతమైనా వాడుతున్న దాఖలాలు లేవు.

మార్పుతో పూర్వ వైభవం

• జనపనార, పర్యావరణ హిత బ్యాగుల వాడకం పెరగాలి. • బయోడిగ్రేడబుల్ కవర్లు అందుబాటులో ఉన్న దృష్ట్యా దుకాణదారులు వాడేలా ప్రోత్సహించాలి. • మున్సిపల్ అధికార యంత్రాంగం తరచూ తనిఖీలు చేపట్టాలి. • ప్రజలు స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలి. • గతంలో మాదిరి అల్పాహారం సహా మాంసం కొనుగోలు చేయాల్సి వస్తే టిఫిన్లు, ఇంటి వద్ద నుంచి సంచులు తెచ్చుకోవాలి.

తనిఖీలు విస్తృతం చేస్తాం...

ప్రజలు, పట్టణ వ్యాపారులకు అవగాహన కల్పిస్తాం. ప్లాస్టిక్ వాడకంతో జరిగే నష్టాలను వివరిస్తాం. ఉల్లంఘనులకు జరిమానా విధిస్తాం. తనిఖీలు విస్తృతం చేస్తాం. ప్రజలు సహకరించాలి. తొలుత మార్పు ప్రజల నుంచే ప్రారంభం కావాలి. – మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ (సిద్దిపేట)

లోక్ అదాలత్‌తో త్వరితగతిన న్యాయం

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్

సిద్దిపేట, న్యూస్‌టుడే: జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు త్వరితగతిన న్యాయం చేకూరుతుందని, పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకునే అవకాశం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్ అన్నారు. ఈ నెల 12న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ని విజయవంతం చేయడంలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కోర్టులో పీపీలు, ప్రభుత్వ ప్లీడర్లు, బీమా కంపెనీల ప్రతినిధులు, న్యాయవాదులు, ఆర్థిక సంస్థల ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. సమస్యలకు పరిష్కారంతో పాటు కేసుల సంఖ్య తగ్గుతుందని, కక్షిదారులకు వ్యయప్రయాసలు తగ్గుతాయన్నారు. పోలీసు శాఖ పరిధిలో రాజీ చేసుకోదగిన కేసులను గుర్తించాలని, ఇరుపక్షాలతో చర్చలు చేపట్టాలని సూచించారు. న్యాయమూర్తులు జయప్రసాద్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రమేశ్ బాబు, పీపీ జీవన్‌రెడ్డి, కనకయ్య తదితరులు ఉన్నారు.

నిషేధిత జాబితాలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చేర్చాలి: ఎంపీ

సిద్దిపేట, సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: 22ఏ నిషేధిత జాబితాలో పేదలు, మధ్య తరగతి కుటుంబాల భూములు చేరడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ నేతృత్వంలో సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గతంలో ప్రాజెక్టులు, కాల్వల కోసం జిల్లాలో పలువురు భూములు కోల్పోయారన్నారు. ఆ సర్వే నంబర్ల పరిధిలో మిగిలిన భూములను నిషేధిత జాబితాలోకి చేర్చడం దారుణమన్నారు. తెలంగాణలో భూములు విక్రయిస్తూ దిల్లీకి డబ్బుల సూట్‌కేసులు తరలిస్తున్నారని ఆరోపించారు. ఒక్కో లబ్ధిదారుకు కేంద్రం 5 కిలోలు, రాష్ట్రం కిలో రేషన్ బియ్యం ఇస్తే సీఎం, మంత్రుల ఫొటోలు పెట్టుకుంటున్నారని,ప్రధాని చిత్రపటాన్ని విస్మరించారన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే ముస్లిం, ముస్లిం అంటే కాంగ్రెస్ అని, ముఖ్యమంత్రిని రేవంతుద్దీన్ అంటూ విమర్శించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనలో కేంద్ర మంత్రి రాజీనామా చేశారని, రాష్ట్రంలో 22ఏ విషయంలో తప్పును అంగీకరించనిప్రభుత్వం అంతటితో సరిపెట్టుకుంటే ఎలా అని ప్రశ్నించారు.

ఎక్కడ కూర్చోవాలి.. ఎలా చదువుకోవాలి?

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు, వివిధ రకాల ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అనుగుణంగా గ్రంథాలయాన్ని తీర్చిదిద్దడంలో పాలకుల ఆసక్తి కరవవుతోంది. గ్రంథాలయానికి వచ్చి చదువుకోవడానికి పాఠకులు సిద్ధంగా ఉన్నా భవనాలు లేక, పుస్తకాలు లేక .. ఎక్కడ కూర్చోవాలి.. ఎలా చదువుకోవాలని నిరుద్యోగులు, విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

ఫర్నిచర్, పుస్తకాలు లేవు

హుస్నాబాద్: హుస్నాబాద్‌లోగ్రంథాలయ భవనం శిథిలమైంది. ఏడేళ్ల క్రితం కొత్త బిల్డింగ్‌కు రూ.50 లక్షల అంచనాతో శంకుస్థాపన జరిగింది. ఏడాది క్రితం మరో రూ.30 లక్షలు కేటాయించారు.పస్తుతం భవనం పనులు పూర్తయ్యాయి. ఫర్నిచర్‌ను ఇతర కార్యాలయాలకు తరలించేందుకు యత్నించగా విద్యార్థులు అడ్డుకున్నారు.డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. టేబుళ్లు, కుర్చీలు రావాల్సి ఉంది. త్వరగా వసతులు కల్పించాలని పాఠకులు కోరుతున్నారు. గ్రంథ పాలకురాలు సరిత మాట్లాడుతూ కొత్త భవనాన్ని ప్రారంభించాల్సి ఉందన్నారు.

చెట్లపొదల మధ్య..

ధూల్మిట్ట: ధూల్మిట్ట మండల కేంద్రంలోని సావిత్రి బాయి పులే గ్రంథాలయం 5 ఏళ్లుగా మూతపడి ఉంది. పొదలు చుట్టూరా నిండి భవనం పనికిరాకుండా పోయింది.

అరకొర వసతుల మధ్యే..

దుబ్బాక, న్యూస్‌టుడే: దుబ్బాక పట్టణ శాఖ గ్రంథాలయం. చిన్న భవనంలో కొనసాగుతోంది. 2019లో రూ.2 కోట్ల అంచనాతో కొత్త భవనానికి శంకుస్థాపన జరిగింది. ఆ నిధులను కాల్వల పనులకు మళ్లించారు .జూనియర్ కళాశాలకు భవనంలోని రెండు గదుల్లోకి మార్చారు. పట్టణ ప్రజలకు ఇది చాలా దూరమైంది.

సమయం పెంచితే ఉపయోగకరం..

– రెడ్డి, చేర్యాల

ప్రస్తుతం ఉదయం 8- 11 గంటలు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకే గ్రంథాలయం తెరిచి ఉంటుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెరిచి ఉంటే పాఠకులకు ఎంతో మేలు కలుగుతుంది. పోటీ పరీక్షలకు ఉపయోగకరంగా ఉండే పుస్తకాలు తెప్పించాలి.

దూరంగా.. అందుబాటులో లేకుండా..

చేర్యాల: నాలుగేళ్ల క్రితం చేర్యాల పట్టణ శివారులో యాదవనగర్ సమీపంలో నిర్మించిన గ్రంథాలయం పాఠకులకు అందుబాటులో లేకుండా ఉంది. గతంలో అంగడిబజారులో నడిపట్టణంలో ఉన్నప్పుడు 500 మందికి పైగా పాఠకులున్న విజ్ఞాలయం ప్రస్తుతం చదివేవారు లేక వెలవెలబోతోంది. లిఖితపూర్వకంగా ఇస్తే కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి అమలు చేస్తామని గ్రంథాలయాధికారిణి కనకలక్ష్మి తెలిపారు.

కొత్త నిర్మాణం ఎప్పుడో?

జగదేవపూర్: 50 ఏళ్లుగా పాఠకులకు సేవలందించిన జగదేవపూర్ గ్రంథాలయం నిర్లక్ష్యానికి గురవుతోంది. పాత భవనం శిథిలమైంది. కొత్త నిర్మాణానికి ప్రజలు ఎదురుచూస్తున్నారు. స్థానిక నాయకులు గ్రామపంచాయతీ సమీపంలో ఓ చిన్నగదిలోకి గ్రంథాలయాన్ని మార్చారు. స్థలం సరిపోవడం లేదు.

ప్రజావాణి దరఖాస్తుల్లో పెండింగ్ వద్దు

మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, న్యూస్‌టుడే: ప్రజావాణిలో అందించే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దని కలెక్టర్ హైమావతి ఆదేశించారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు తరలివచ్చి అర్జీలు సమర్పించారు. అంతకుముందు శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. వెనువెంటనే ప్రక్రియ ప్రారంభించాలని, అర్హులకు న్యాయం చేయాలన్నారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ నేతృత్వంలో అధికారులు మొత్తం 103 దరఖాస్తులు స్వీకరించారు. డీఆర్వో నాగరాజమ్మ, అధికారులు సుదర్శన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. సిద్దిపేట ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్డీవో సదానందం దరఖాస్తులు స్వీకరించారు.

చింతగుట్ట ఆలయం.. వేడుకలకు సిద్ధం

కొండపాక గ్రామీణం: కొండపాక మండలం బందారంలోని చింతగుట్ట గరుడాంజనేయస్వామి క్షేత్రంలో సెప్టెంబర్ 3 నుంచి 7 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 3న గణపతి పూజతో మొదలై కార్యక్రమాలు కొనసాగుతాయి. సెప్టెంబర్ 7న మహాపూర్ణాహుతితో ఈ కార్యక్రమం పూర్తవుతుంది. బ్రహ్మశ్రీ వేదమూర్తులు జంధ్యాల రాజేశ్వరశాస్త్రి శిష్య బృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని ఆలయ ధర్మకర్త బెజుగాం నర్మద రవీంద్రప్రసాద్ తెలిపారు.

సుందరీకరణ పనులకు అదనంగా రూ.3 కోట్లు మంజూరు



హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువుపై జరుగుతున్న సుందరీకరణ పనులను పూర్తి చేసేందుకు అదనంగా రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు పురపాలక శాఖ డైరెక్టర్ శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్లమ్మ చెరువుపై సుందరీకరణ పనులు గత జనవరిలో రూ.18 కోట్లతో ప్రారంభించారు. తెలంగాణలోనే తొలి గ్లాసు బ్రిడ్జి నిర్మాణం చివరి దశకు చేరింది. కట్టపై గార్డెనింగు, లైటింగు ప్రవేశ ద్వారము తదితర నిర్మాణాలు జరుగుతున్నాయి.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9000014771
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008001735

TG
(c) eenadu

మహిళా క్రికెటర్లకు మంచి భవిష్యత్తు

• గ్రామీణ ప్రాంతాలకు వచ్చి ప్రతిభ వెలికితీస్తాం • 'న్యూస్‌టుడే'తో తెలంగాణ క్రికెట్ ఆపరేషన్ కమిటీ సభ్యురాలు సునీత ఆనంద్

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ: మహిళా క్రికెట్‌కు కొన్ని సంవత్సరాలుగా ఆదరణ పెరుగుతోంది. 2025లో వరల్డ్ కప్ సాధించిన తరువాత యువతులు క్రికెట్ నేర్చుకోవడానికి ముందుకొస్తున్నారు. స్మృతి మంధానా.. హర్మన్‌ప్రీత్ కౌర్, షెఫాలివర్మ, దీప్తిశర్మ వంటి క్రికెటర్లను స్ఫూర్తిగా తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు హైదరాబాద్‌లోనే నిర్వహించే మహిళా క్రికెట్ ఎంపికలు మొదటి సారిగా ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి సంగారెడ్డిలో సోమవారం నిర్వహించారు. భారత మాజీ క్రికెటర్, తెలంగాణ క్రికెట్ ఆపరేషన్ కమిటీ సభ్యురాలు సునీత ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమెతో 'న్యూస్‌టుడే' ముఖాముఖి మాట్లాడింది. కార్యాచరణ ఆమె మాటల్లోనే..

హెచ్‌సీఏ ప్రత్యేక చర్యలు

గ్రామాల్లోనే ప్రతిభావంతులైన మహిళా క్రికెటర్లు ఉన్నారు. సరైన సదుపాయాలు, ప్రోత్సాహం లేక వెనుకబడుతున్నారు. వారిని గుర్తించేందుకు హెచ్‌సీఏ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోంది. ప్రతిభ ఉన్న వారిని ప్రోత్సహిస్తాం. ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తాం.

మొదటి సారిగా జిల్లాల్లో..

హైదరాబాద్‌లోకే పరిమితమైన ఎంపికలను మొదటి సారిగా ఈ జిల్లాలో చేపడుతున్నాం. మేమే గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి అక్కడి పరిసరాలు, పరిశీలిస్తాం. స్థానికంగానే నేర్పిస్తాం. అవసరాలను సమకూరుస్తాం.

లీగ్ మ్యాచ్‌లతో తేల్చుతాం

సునీత ఆనంద్

ముఖాముఖి

గతంలో కేవలం ఓపెన్ సెలక్షన్స్ మాత్రమే జరిగేవి. ఆ సమయంలో ఆడలేని వారు వెనుకబడతారు. లీగ్ మ్యాచ్‌లు నిర్వహించి ఎంపికలు చేస్తాం. ప్రతిభ ఉన్న గ్రామీణుల ప్రతిభ వెల్లడవుతుంది.

రోజూ 4 గంటల సాధన

జాతీయ స్థాయి క్రికెట్ వరకు రావాలంటే నిత్యం సాధన ఉదయం, సాయంత్రం 4 గంటల సాధన అవసరం. అనువజ్ఞులైన శిక్షకుల సహాయం తీసుకోవాలి. కఠినంగా ప్రాక్టీస్ చేస్తేనే ముందంజ వేయగలుగుతారు. జిల్లాల్లో ఇండోర్ మైదానాలు, వసతులు, కోచ్‌ల నియామకానికి చర్యలు తీసుకుంటాం.

ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన మహిళా క్రికెటర్లకు సూచనలు ఇస్తున్న తెలంగాణ క్రికెట్ ఆపరేషన్ కమిటీ సభ్యురాలు సునీత ఆనంద్

గల్లీ గల్లీ.. శబ్దాల లొల్లి!

• ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్ల మార్పు

భారత మోటారు వాహనాల చట్టం ప్రకారం శబ్దం 75-80 డెసిబుల్స్

ద్విచక్ర వాహనదారులు వేసిన సైలెన్సర్ల శబ్దం 100-120 డెసిబుల్స్

సిద్దిపేట పోలీసులు స్వాధీనం చేసుకున్న సైలెన్సర్లు

జిల్లా	మొత్తం వాహనాలు	ద్విచక్ర వాహనాలు
వికారాబాద్	1,48,285	56,627
సంగారెడ్డి	3,67,948	2,34,246
మెదక్	1,42,693	61,140
సిద్దిపేట	3,87,407	2,61,438

న్యూస్‌టుడే, తాండూరు గ్రామీణ, సంగారెడ్డి అర్బన్, సిద్దిపేట: వాహనదారుల్లో కొందరి సరదా మరికొందరి ప్రాణాల మీదకు తెస్తోంది. ద్విచక్ర వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను అమర్చుతున్నారు. భారీ శబ్దం, గాలి కాలుష్యంతో హడలెత్తిస్తున్నారు. ఉన్నత విద్య, ఉపాధి, ఉద్యోగాలకు వెళ్లే వారంతా ద్విచక్ర వాహనాలను వినియోగిస్తున్నారు. వీరిలో మహిళలు సైతం ఉంటున్నారు. ద్విచక్ర వాహనాలను తోలడం సాధారణంగా మారింది. ప్రధానంగా బుల్లెట్ ప్రియులు పాతతరం భారీ శబ్దం టపాసుల పేలుడు మాదిరి వచ్చే సైలెన్సర్లను అమర్చుతున్నారు. వేగంతో కూడిన శబ్ద తీవ్రత చుట్టుపక్కల వారికి ప్రమాదకరంగా ఉంటోంది.

ఇబ్బందులు ఇలా..

- భారీ శబ్దంతో రాకపోకల సమయంలో స్థానికులు, తోటి వాహనదారులు ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదముంది.
- వెల్డింగ్, వడ్రంగి, చెరుకు బండి వంటి వాటిలో ఆకస్మిక పెద్దశబ్దానికి ఏకాగ్రత కోల్పోయి గాయాల పాలవుతున్నారు.
- బాలలు, వృద్ధులు, గర్భిణులకు ఆందోళన పెరుగుతుంది.
- రక్తపోటు పెరుగుతుంది.
- చెవులు దెబ్బతిని వినికిడి లోపం వస్తుంది.
- మానసిక ఒత్తిడికి గురవుతారు.

చలానాలు విధిస్తారని.. పోలీసుల కన్నుగప్పి..

పోలీసులు ప్రధాన రహదారులు, కూడళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా కొన్నిసార్లు పట్టుబడుతున్నారు. వారికి రూ.5 వేల నుంచి రూ.10 వేల చలానా విధిస్తున్నారు. కొందరివి జప్తు చేశారు. గతంలో ముప్పై వాహనాలవి తొలగించి ధ్వంసం చేశారు. సిద్దిపేటలోనూ పోలీసు కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆధ్వర్యంలో పది రోజుల క్రితం 240 సైలెన్సర్లు తీయించి రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేయించారు. ఇంకా చాలాచోట్ల వాహనదారులు కొందరు వినియోగిస్తూ ప్రజలను హడలగొడుతున్నారు.

ముడుపులు.. వృక్షాభరణాలు

మల్లన్న గుడిలో గంగరేణి చెట్టు వద్ద ముడుపులు

న్యూస్‌టుడే, చేర్యాల: మదినిండా 'మల్లన్న' నామస్మరణ చేస్తూ సుదూర ప్రాంతాల నుంచి కొమురవెల్లికి వచ్చే భక్తులు తమ కోర్కెలు తీర్చాలని వేడుకుంటారు. పలు విధాలుగా మొక్కులు చెల్లించుకుంటుంటారు. కొందరు పట్నాలు వేయడం, బోనాల నైవేద్యం సమర్పించడం, హుండీల్లో కానుకలు వేస్తుండగా.., మరి కొందరు మళ్లొచ్చే బ్రహ్మోత్సవాలలోపు తాము కోరిన కోరిక తీరాలంటూ ఆలయానికి ముందున్న గంగరేణి చెట్టు వద్ద ఇనుప చువ్వలకు ముడుపు కట్టి ప్రణమిల్లుతారు. ఏటా సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు ఇలా కడతారు. కోరిక తీరగానే మళ్లీ వచ్చే బ్రహ్మోత్సవాల సమయంలో ముడుపు విప్పి, అందులోని కొబ్బరికాయ కొట్టి మొక్కుబడి చెల్లించుకుంటారు. యేటా 'మల్లన్న' దర్శనానికి సుమారు 30 లక్షలకు పైగా భక్తులు వస్తారు. వందల సంఖ్యలో ఇలా ముడుపు కట్టి వెళ్తారు. దాదాపు వందేళ్ల కిందటి నుంచి ఈ గంగరేణి చెట్టు ఉంది.

కేతకి సంగమేశ్వరుడికి రుద్రాభిషేకం

ఝరాసంగం, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం కేతకి ఆలయానికి శ్రావణమాసం మూడో సోమవారం భక్తులు భారీగా తరలివచ్చి సంగమేశ్వరుడిని దర్శించుకున్నారు. స్వామివారికి పంచామృతంతో రుద్రాభిషేకాలు, బిల్వార్చన, మంగళహారతి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న అమృత గుండంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. మహారాష్ట్రలోని అహ్మదాపూర్‌కు చెందిన వెయ్యి మంది భక్తులు పాదయాత్రగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో శివ రుద్రప్ప, సీఐ హన్మంతు, ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్ పర్యవేక్షించారు.

వ్యసనాలకు బానిసై యువకుడి బలవన్మరణం

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: వ్యసనాలకు బానిసై ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా వీరారెడ్డిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన **కానుగంటి నర్సింలు** (33) వ్యవసాయం చేస్తుంటాడు. వ్యసనాలకు బానిసై అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చలేక పొలంలో ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అర్హుల ఓట్లు తొలగిపోకుండా జాగ్రత్తపడాలి: వెన్నెల

దుబ్బాకలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ వెన్నెల

దుబ్బాక: సర్ ప్రక్రియలో భాగంగా రూపొందించిన ముసాయిదా జాబితాలో పేర్లు గల్లంతైన ఓటర్లకు తిరిగి ఓటు హక్కు కల్పించేలా పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్, సర్ పార్లమెంటరీ ఇన్‌ఛార్జి డా.జి.వెన్నెల అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో 'సర్' ఫేజ్-2పై బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనామలీస్ ఓటర్లకు సంబంధించి నోటీసులు అందుకుంటున్న వారి సందేహాల నివృత్తికి పార్టీ నాయకులు సహకరించాలన్నారు. దుబ్బాక, తొగుట ఏఎంసీ ఛైర్మన్లు కొంగర రవి, చెరుకు విజయ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో కవలల జననం

కవల పిల్లలతో ఈఎంటీ గురప్ప

కంగ్టి, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం సిద్ధంగిర్గ గ్రామానికి చెందిన మరియమ్మ(28) సోమవారం పురిటి నొప్పులతో బాధపడుతుండగా.. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం ఆమెను 108 వాహనంలో కంగ్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్తుండగా.. మార్గం మధ్యలో కవల పిల్లలకు జన్మనిచ్చింది. బాలిక, బాలుడు జన్మించారు. ఆమెకు ఇప్పటికే కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు ఆసుపత్రిలో క్షేమంగా ఉన్నారని ఈఎంటీ గురప్ప తెలిపారు. అంబులెన్స్‌లో కవలలు జన్మించడం ఈ ప్రాంతంలో ఇదే తొలిసారి అని చెప్పారు.

ఉమ్మడి జిల్లా మహిళా క్రికెట్ జట్టు ఎంపిక

సంగారెడ్డి మున్సిపాలిటీ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా సంఘం సహకారంతో మహిళా క్రికెట్ జట్టు ఎంపిక సోమవారం సంగారెడ్డిలోని ఎంఎస్ అకాడమీలో నిర్వహించారు. తెలంగాణ మహిళా క్రికెట్ అసోసియేషన్ కమిటీ సభ్యురాలు సునీత ఆనంద్ పర్యవేక్షణలో ఎంపికలు జరిగాయి. ఉమ్మడి జిల్లా నుంచి 38 మంది పాల్గొనగా.. ప్రతిభ చూపిన వారి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఆమె చెప్పారు. సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాజేందర్ రెడ్డి, కోచ్‌లు శ్రీనాథ్‌రెడ్డి, ఖలీముద్దీన్, మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అప్పులు చేసి చిరు వ్యాపారి పరారీ

పాపన్నపేట: ప్రజల నుంచి అప్పులు తీసుకొని ఓ చిరు వ్యాపారి పరారైన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాలు.. పొరుగు జిల్లాకు చెందిన ఓ వ్యాపారి తన కుటుంబంతో కలిసి మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని చిత్రియాల్ క్రాస్‌రోడ్‌కు వలస వచ్చారు. అక్కడే చిన్న కిరాణా దుకాణం నడిపిస్తున్నారు. ఈ క్రమంలోనే దుకాణానికి వచ్చే ప్రజలతో సన్నిహితంగా ఉంటూ స్థానికుల వద్ద నమ్మకస్థులుగా ఉన్నారు. ఇదే అదనుగా వ్యాపారం, ఇంటి నిర్మాణం కోసం డబ్బులు అవసరమని కొన్నేళ్లుగా చిత్రియాలతో పాటు పరిసర గ్రామాల ప్రజల వద్ద రూ.లక్షల్లో అప్పులు తీసుకున్నారు. కొన్ని రోజుల కిందట ఇంటికి తాళం వేసి రాత్రికి రాత్రే గ్రామం నుంచి కనిపించకుండా పరారయ్యారు. పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందించకపోవడంతో మోసపోయామని బాధితులు గుర్తించారు.

అంతర్రాష్ట్ర మహిళా దొంగ అరెస్టు

పోలీసులు అరెస్టు చేసిన నిందితురాలు

తాండూరు, వికారాబాద్, న్యూస్‌టుడే: ఒంటరిగా ఉంటున్న వితంతు, వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకొని బంగారు ఆభరణాల చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర మహిళా దొంగను సీసీఎస్ పోలీసులు తాండూరు పట్టణంలో అరెస్టు చేశారు. వికారాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్‌రాయ్ సోమవారం వికారాబాద్ ఠాణాలో విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని షోలాపూరు భీమ్‌నగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మీ అసాడే తాండూరు పట్టణ ఠాణా పరిధిలో జరిగిన 5 చోరీల్లో 9.5 తులాల బంగారు ఆభరణాలు అపహరించింది. చోరీలను ఛేదించేందుకు ఎస్పీ స్నేహమెహ్రా వికారాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్‌రాయ్‌కి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు నేరాలు జరిగిన తీరును క్షుణ్నంగా పరిశీలించి సాంకేతిక పరిజ్ఞానంతో నిందితురాలి కదలికలను గుర్తించారు. లక్ష్మీ అసాడే ఒంటరిగా ఉంటున్న వితంతు, వృద్ధ మహిళలతో పరిచయం పెంచుకుంటుంది. దృష్టి మరల్చి వారు ధరించిన బంగారు గొలుసులు, నెక్లెస్‌లు, గాజులను ఎత్తుకెళుతుంది. వరుసగా జరిగిన కేసుల్లో సారూప్యతను పోలీసులు గుర్తించారు. తాండూరు, కర్ణాటక రాష్ట్రంలో నమోదైన కేసుల మధ్య ఉన్న నేరాల విధానాన్ని పోల్చి చూశారు. సోమవారం నిందితురాలు తాండూరు బస్టాండ్ సమీపంలో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేసి దర్యాప్తు ప్రారంభించారు. షోలాపూరు జిల్లా ఎంఐడీసీ ఠాణా పరిధిలో 3, బార్శి, హైదరాబాద్ సిటీ మార్కెట్ ఠాణాల పరిధిలో ఒక్కో కేసు నమోదైందని గుర్తించారు. తాండూరులో మాదిరిగానే కర్ణాటక రాష్ట్రంలోని గదక్‌టౌన్‌లో 2, నవనగర్ ఠాణా పరిధిలో ఒక చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మూడు కేసుల్లో 14.5 తులాల బంగారు ఆభరణాల చోరీల్లో నిందితురాలి ప్రమేయమున్నట్లు గుర్తించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. తాండూరు పట్టణ ఎస్సై మమత, హెడ్ కానిస్టేబుళ్లు జయవర్ధన్, శివకుమార్, పాండు, రాజు, రవీందర్, గాయత్రిని అదనపు ఎస్పీ రాజేశ్మీనా అభినందించారు.

మహిళల రక్షణకు అనేక చట్టాలు: పద్మజా రమణ

చేర్యాలలో మాట్లాడుతున్న మహిళా కమిషన్ రాష్ట్ర కార్యదర్శి పద్మజా రమణ

చేర్యాల, న్యూస్‌టుడే: మహిళల రక్షణకు ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చాయని, ఏ సమస్య ఎదురైనా మహిళలు నేరుగా కమిషన్ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటామని తెలంగాణ మహిళా కమిషన్ రాష్ట్ర కార్యదర్శి పద్మజా రమణ అన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాల కస్తూర్బా విద్యాలయంలో సోమవారం జరిగిన మహిళలు, బాలికల భద్రత, ఆరోగ్యం, హక్కులపై అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల హక్కులు, రక్షణకు సంబంధించి సుమోటో కేసులు స్వీకరిస్తామని, అందుకే బాలికలు చట్టపరమైన రక్షణ సహాయ వ్యవస్థలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశుసంక్షేమ అధికారిణి శారద, ఎంఈవో నరేందర్, పురాధ్యక్షురాలు ముస్త్యాల అరుణ, కౌన్సిలర్ కొమ్ము రాజేశ్వరి, సీడీపీవో రమాదేవి, చేర్యాల ఎస్సై అపూర్వరెడ్డి, సైబర్‌క్రైం ఎస్సై దివ్య, వైద్యురాలు హరితరెడ్డి, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ విద్యార్థులకు టాప్ క్లాస్

• దరఖాస్తుకు చివరి తేదీ 31 అక్టోబరు

మీకోసం

సిద్దిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత చదువులు కొందరికి కలమాత్రమే. నిరుపేద ఎస్సీ విద్యార్థుల చదువును ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం 'టాప్ క్లాస్' పథకం ద్వారా అండగా నిలుస్తోంది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశవ్యాప్తంగా సుమారు 2,000 మంది విద్యార్థులకు ఈ ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఎంపికైన విద్యార్థులకు ల్యాప్‌టాప్, పుస్తకాలు, స్టేషనరీ మరియు ఇతర విద్యా సంబంధిత ఖర్చుల నిమిత్తం మొదటి ఏడాది రూ.86,000 అందజేస్తారు. ఆ తర్వాత ప్రతి ఏటా రూ.41,000 చొప్పున ఇస్తారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు ట్యూషన్ ఫీజుతో పాటు ఇతరాలను ప్రభుత్వమే భరిస్తుంది.

అర్హతలు: • ఎస్సీ కేటగిరీకి చెందిన విద్యార్థులై ఉండాలి. • కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షల లోపు ఉండాలి. • ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐఎం తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రముఖ విద్యా సంస్థల్లో రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. • మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. • మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది. • 30 శాతం బాలికలకు కేటాయించారు. • నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా దరఖాస్తు సమర్పించాలి. • ఒక కుటుంబంలో ఇద్దరికే వర్తిస్తుంది. • ఇతర ఉపకార వేతనాలు పొందుతుంటే అనర్హులు.

హత్య, పోక్సో కేసులో నిందితుడికి జీవితఖైదు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: సిద్దిపేటలోని రెండో ఠాణా పరిధిలో హత్య, పోక్సో కేసులో నిందితుడికి జీవితకాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సిద్దిపేట న్యాయస్థానం న్యాయమూర్తి వై.జయప్రసాద్ సోమవారం తీర్పు వెలువరించారు. రెండో ఠాణా సీఐ మురళి తెలిపిన వివరాలు.. బిహార్ రాష్ట్రానికి చెందిన బోలోరామ్ హరిజన్ అనే వ్యక్తి గతంలో మైనర్ బాలికను పెళ్లి చేసుకున్నాడు. అనంతరం ఆమెను ఇంట్లో చంపి మృతదేహాన్ని దాచిపెట్టిన ఘటనలో 2025, మార్చి 1న నిందితుడిపై సిద్దిపేట రెండో ఠాణాలో కేసు నమోదైంది. కేసులో భాగంగా అప్పటి సీఐ ఉపేందర్ సమగ్ర దర్యాప్తు నిర్వహించి పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జీషీట్‌ను దాఖలు చేశారు. సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయమూర్తి జయప్రసాద్.. హత్య కేసులో నిందితుడైన బోలోరామ్ హరిజన్‌కు జీవితకాల కఠిన కారాగార శిక్ష, పోక్సో కేసులో కఠిన కారాగార శిక్షతో పాటు రూ.25,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

బీడీ, సిగార్ రాష్ట్ర అధ్యక్షుడిగా గోపాలస్వామి

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కామిని గోపాలస్వామి ఎన్నికయ్యారు. సిద్దిపేటలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర మహాసభలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.రమ, కోశాధికారిగా బాలమణి, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, భాస్కర్, పద్మ, మోహన్, పుష్ప, చౌదరి, కార్యదర్శులుగా శోభ, సత్యం, రాజు, సులోచన, రాష్ట్ర కమిటీ సభ్యులుగా అంజయ్య, భాస్కర్, శ్యామల, లావణ్య, లహరి, గణేశ్ ఎన్నికయ్యారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

తాండూరు గ్రామీణ: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాండూరు మండలం సంకిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. **నందురెడ్డి** (30) వ్యవసాయం చేస్తున్నాడు. ఆదివారం కుటుంబ సభ్యులంతా బంధువుల వివాహానికి వెళ్లారు. నందురెడ్డి పొలం పనులకు వెళ్లాడు. స్థానికులు ఫోన్ చేస్తే స్పందించలేదు. పొలం వద్ద పరిశీలించగా షెడ్డులో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. నందురెడ్డికి భార్య, కుమార్తె, నెలన్నర కుమారుడున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అల్లం సాగు.. తెగుళ్ల నివారణతో బాగు

రైతుకు మెలకువలు చెబుతున్న వ్యవసాయ అధికారి

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్: అల్లం సాగులో మెలకువలు పాటిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని సంగారెడ్డి జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి పండరి సూచించారు. తెగుళ్లను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అల్లంసాగులో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

బ్యాక్టీరియా వడలు తెగులు: ఈ తెగులు ప్రస్తుతం ఎక్కువగా ఆశిస్తోంది. తెగులు సోకిన ఆకుల అంచులు ఇత్తడిరంగుకు మారడంతో పాటు వెనకకు ముడుచుకుపోతాయి. క్రమంగా మొక్క వడలి ఎండిపోతుంది. భూమికి దగ్గరలోని కాండాన్ని పరిశీలిస్తే చెడు వాసన వస్తుంది. నివారణకు స్ట్రెప్టోసైక్లిన్ 20 గ్రా./ 100 లీటర్ల నీటికి కలిపి మొక్క వేర్ల వద్ద పిచికారీ చేయాలి.

దుంపకుళ్లు తెగులు: ఈ తెగులు ముఖ్యంగా నీరు నిల్వ ఉండే నేలల్లో కనిపిస్తుంది. ఆకులు పసుపు రంగులోకి మారుతాయి. తెగులు సోకని పొలం నుంచి విత్తనం ఎంచుకోవాలి. పొలంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలి. తెగులు లక్షణాలు కనిపిస్తే ట్రైకోడెర్మావిరిడి 10 గ్రా./ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 2 గ్రా./ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

పొలుసు పురుగు: విత్తన దుంపలను ఆశించి రసం పీల్చుతాయి. విత్తన దుంపలను లీటరు నీటికి 5 మి.లీ. చొప్పున మలాథియాన్ కలిపిన ద్రావణంలో 30 నిమిషాలు నానబెట్టాలి. విత్తనం ఆరబెట్టాక విత్తుకుంటే పురుగు నివారించవచ్చు.

వేరుపురుగు: దుంపల మొదళ్లలో వేర్లను కత్తిరిస్తుంది. నష్టం గమనించగానే ఫోరేట్ గుళికలు 5 కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ గుళికలు ఎకరానికి ఏడు కిలోలు వేయాలి.

మొవ్వుతొలుచు పురుగు: ఈ పురుగు మొవ్వును తొలచడం వల్ల మధ్య కొమ్మ చనిపోతుంది. నివారణకు లీ. నీటికి డైమిథోయేట్ 2 మి.లీ.+సాండోవిట్ 1 మి.లీ./లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఫిల్లోస్టికా ఆకుమచ్చ తెగులు: ఈ తెగులును ఆకులపై జులై నుంచి అక్టోబరు మాసాల్లో గమనిస్తాం. ప్రారంభదశలో ఆకులపై అండాకారంలో ఉండి నీటిని పీల్చుకున్నట్లుగా మచ్చలు ఏర్పడతాయి. ఆకులు పెళుసుగా మారతాయి. నల్లటి మచ్చలు ఆకుల ఉపరితలంపై ఏర్పడి ఎండిపోతాయి. ఆక్సీక్లోరైడ్ గల శిలీంద్రనాశిని(బ్లైటాక్స్) మందును 3గ్రా./లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు

సాగులో సందేహాలా?

సంప్రదించాల్సిన ఫోన్ నంబరు **9963164507**

న్యూస్‌టుడే, చేర్యాల:

ప్రశ్న: వేరుసెనగలో జిప్సం ఎంత మోతాదులో వేయాలి? – యాదగిరి, రైతు, తాండూరు

సమాధానం: నీటి పారుదల ఉన్న ప్రాంతాల్లో ఎకరానికి 200 కిలోల జిప్సం తొలిపూత సమయంలో వేసుకుంటే నూనె గింజ పంటల్లో అధిక దిగుబడులు పొందవచ్చు.

ప్రశ్న: మిశ్రమ ఎరువులతో కలిపి జింక్ వేసుకోవచ్చా? – బాలకిషన్, దుబ్బాక

సమాధానం: భాస్వరం, జింక్ ఎరువులను ఎప్పుడూ కలిపి వేయకూడదు. వీటి మధ్య వ్యతిరేక చర్యల వల్ల వేసిన జింక్ లభ్యత తగ్గడం లేదా పూర్తిగా అందకపోవచ్చు. భాస్వరం ఎరువు వేసిన మూడు, నాలుగు రోజుల తర్వాత జింక్ ఎరువు వేసుకోవాలి.

చందుపట్ల పల్లవి, శాస్త్రవేత్త (తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం - సిద్దిపేట)

కంది, పత్తిలో కలుపుంటే..

కంది, పత్తి పైర్లకు అవసరం మేరకే నీరందేలా చూడాలి. అంతర కృషి ద్వారా ఎప్పటికప్పుడు కలుపు తొలగించాలి. నీటిఎద్దడి వల్ల మొక్కకు సరైన మోతాదులో పోషకాలు అందక ఎదుగుదల ఆగిపోయే ప్రమాదముంది. అందుకు 2 శాతం యూరియా ద్రావణం లేదా రెండు శాతం డీఏపీ లేదా 5 శాతం 19.19.19 ద్రావణాన్ని మొక్కలపై పిచికారీ చేయాలి. – న్యూస్‌టుడే, చేర్యాల

మీకు తెలుసా..?

పంటల సాగుకు రైతులు బిందు సేద్యం పద్ధతి పాటిస్తే 40 శాతానికి పైగా నీరు ఆదా అవుతుంది. దీంతోపాటు 15-40 శాతం ఎరువులు, 20-30 శాతం రసాయనాలు, 10-15 శాతం కూలీల అవసరం తగ్గి 30-70 శాతం దిగుబడులు పెరిగి భారీగా లాభం పొందుతారు.
– న్యూస్‌టుడే, చేర్యాల

పూల తోట.. లాభాల బాట

ఆదర్శంగా నిలుస్తున్న మహిళా రైతు

సరవ్వ

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: పూల సాగు చేపట్టిన ఓ మహిళా రైతు అందరికీ ఆదర్శంగా నిలుస్తూ.. రోజువారీ ఆదాయంతో లాభాల బాటలో పయనిస్తోంది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పందిల్లకు చెందిన మూడెత్ల సరవ్వ తనకున్న వ్యవసాయ భూమిలో సంప్రదాయ పంటలతో పాటు కొంత విస్తీర్ణంలో పూల తోటలు పెంచుతున్నారు. 10 గుంటల్లో దొడ్డుమల్లె, మూడు గుంటల్లో సన్న జాజి మల్లె, గట్లవెంట కాగడా మల్లె వేస్తున్నారు. వీటితో పాటు కనకాంబరాలు, చామంతి, పట్టుకుచ్చులు వంటివి సాగుచేస్తున్నారు.

పూలమొగ్గలు

తండ్రి నుంచి నేర్చుకుని..

- సరవ్వ తన తండ్రి మారుపాక రాజయ్య నుంచి పూలసాగును నేర్చుకున్నారు. ఆయన 40 ఏళ్ల క్రితమే వివిధ రకాల పూలతోటలు సాగు చేసేవారు.
- మొక్కల వద్ద కలుపు తీయడం, నీరందించడం, పూలు తెంపడానికి సరవ్వ ప్రత్యేకంగా ఒక మహిళా కూలీని నియమించుకున్నారు.
- దొడ్డు మల్లెచెట్లు వేసవిలో పూస్తాయి. ప్రస్తుతం సన్నజాజి, కాగడ మల్లెచెట్లు మాత్రమే పూస్తున్నాయి. సీజన్‌లో అయితే రోజుకు 3 నుంచి 4 కిలోలకు పైగా పూలు వస్తాయని, ప్రస్తుతం సన్నజాజి రోజుకు 2 కిలోల పూల దిగుబడి వస్తోందన్నారు.

నేరుగా వినియోగదారులకే విక్రయం

- పూసిన పూలను ఒక్కోసారి కిలోల చొప్పున, మిగతా సమయాల్లో మూరల చొప్పున విక్రయిస్తున్నారు.
- రోజూ తెంపిన పూలను కుటుంబసభ్యులు మాలలు కడతారు. వాటిని సరవ్వ రోజూ సిద్దిపేటలో నేరుగా వినియోగదారులకు విక్రయిస్తోంది.
- ప్రస్తుతం మూరకు రూ.30 చొప్పున, రోజుకు 15 మూరలు విక్రయిస్తూ నిత్యం రూ.450కి పైగా ఆదాయం పొందుతున్నారు.
- పూల లభ్యత, పెళ్లిళ్లు, ఇతర శుభాకార్యాల సీజన్‌ను బట్టి ధరలు మారతాయని సరవ్వ కూతురు శ్రీలక్ష్మి తెలిపారు.
- కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఇతర పంటల కన్నా పూలసాగుతో మంచి లాభాలు పొందవచ్చని, వీటి ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ అవసరాలతో పాటు ఇతర పంటల పెట్టుబడికి ఉపయోగపడుతుందంటున్నారీ మహిళా రైతు.

(c) eenadu

పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు సహకరించాలి: ఎంపీ

ఒకే కారులో ప్రయాణిస్తున్న ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య

దుబ్బాక, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని, పాఠశాలల అభివృద్ధికి, వాటి బలోపేతానికి ప్రతి ఒక్కరు తమవంతు సహకారాన్ని అందించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలో పూర్తయిన సీసీ రహదారి, ఎంపీపీఎస్, జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో పూర్తయిన ప్రహరీ నిర్మాణాలను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఎంపీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో డి.అంజయ్య, హెచ్‌ఎం శ్రీనివాస్, సర్పంచి రజిత తదితరులు పాల్గొన్నారు. నిత్యం ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకునే భాజపా నాయకులు ఎంపీ రఘునందన్‌రావు, భారాస ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు రామేశ్వరంపల్లి నుంచి భూంపల్లి గ్రామం వరకు ఎంపీ కారులో ప్రయాణించారు. గతంలో వీరు భారాస, భాజపా నుంచి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా పోటీ చేయడం విశేషం. వారి వెంట రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ఆస్పత్రుల్లో సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన

నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

బెజ్జంకి, న్యూస్‌టుడే: మండలంలోని బెజ్జంకి, తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది ఖాళీలను వెంటనే భర్తీ చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు నిరసన చేపట్టారు. తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆస్పత్రుల్లో స్టాఫ్‌నర్సు, సూపర్‌వైజర్, సీహెచ్‌వో, తదితర కీలక పోస్టులతో పాటు పలు గ్రామాలకు ఏఎన్‌ఎం పోస్టులు భర్తీ చేయడంలో అధికారులు జాప్యం చేయడం తగదన్నారు. పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆరోపించారు. బెజ్జంకి ఆస్పత్రికి రోగుల తాకిడి పెరగడం, భవనం ఇరుకుగా మారినందున 30 పడకల ఆస్పత్రిగా విస్తరించాలని డిమాండ్ చేశారు. సాయిక్రిష్ణ, ఎల్లయ్య, లింగం, పరశురాములు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాచారం అందించడంలో ఆలస్యం

✦ రూ.10 వేల పరిహారం చెల్లించాలని ఆదేశం

సిద్దిపేట, న్యూస్‌టుడే: సమాచారం అందించడంలో జాప్యంపై స్పందించిన రాష్ట్ర సమాచార కమిషన్ కలెక్టరేట్‌లోని ప్రజా సమాచార అధికారి(రెవెన్యూ విభాగం)ని పరిహారం చెల్లించాలంటూ ఆదేశించింది. ఆ వివరాలను మల్లన్నసాగర్ నిర్వాసితులు, దరఖాస్తుదారులు హయతొద్దీన్, అశోక్, ప్రభాకర్ సోమవారం వెల్లడించారు. ఈ మేరకు వినతిపత్రాలను కలెక్టరేట్ వద్ద ప్రదర్శించారు. తొగుట మండలం వేములఘాట్, ఏటిగడ్డ కిష్టాపూర్, లక్ష్మాపూర్ గ్రామాలు ముంపునకు గురైన నేపథ్యంలో ఆర్‌అండ్‌ఆర్ అర్హుల జాబితా, కేటాయించిన ఇళ్లు, స్థలాల వివరాలు, ఇళ్లకు సంబంధిత పరిహారం, ఇతరత్రా అంశాలపై సమాచారం అందించాలంటూ స.హ. చట్టం కింద కలెక్టరేట్‌లో 2024 ఫిబ్రవరిలో మొత్తం ఏడు దరఖాస్తులు సమర్పించారు. మధ్యలో పలుమార్లు అడిగినా సమాచారం లభించకపోవడంతో రాష్ట్ర సమాచార కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికి స్పందన లేకపోవడంతో హైదరాబాద్‌లో జులై 20న విచారణ చేపట్టిన కమిషన్ అధికారులు.. ముగ్గురు దరఖాస్తుదారులకు కలిపి రూ.10 వేలు పరిహారం చెల్లించాలని, రెండు వారాల్లో సమాచారం అందించాలంటూ ప్రజా సమాచార అధికారిని ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆరంభంలో ఉత్సాహం.. నిధులు లేక తాత్సారం

అసంపూర్తి పనులతో కానరాని ప్రగతి జాడ

పరిశీలన

న్యూస్‌టుడే, బెజ్జంకి: అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయంటే అన్ని వర్గాల్లో కొండంత ఆనందాన్ని కలిగిస్తుంది. ప్రగతి పథంలో పల్లె ముందంజ వేస్తుందనే సంతోషాన్ని నింపుతుంది. కానీ పనులు పూర్తి కాకపోవడం, నిధుల్లేక పనులు నిలిచిపోవడం నిరాశను కలిగిస్తోంది. ఒకటి, రెండు కాదు చాలా అభివృద్ధి పనులు నాలుగైదేళ్లుగా పూర్తికి నోచుకోకపోవడం పాలకులు, అధికారుల తీరును ప్రశ్నిస్తోంది. పనుల ప్రారంభంలో చూపిన ఉత్సాహాన్ని పూర్తి చేయడంలో ఎందుకు చూపడం లేదని ప్రజలు వాపోతున్నారు. బెజ్జంకిలో పలు అభివృద్ధి పనులు ఏళ్లుగా పూర్తికి నోచుకోకపోవడం ప్రగతిపై ప్రభావం చూపుతోంది.

✦ మండల కేంద్రంలో రెండు పడక గదుల ఇళ్ల సముదాయం సమీపంలో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో వివాహాలకు ఆసరాగా నిలవాలనే ఉద్దేశంతో ఐదేళ్ల క్రితం రూ.కోటి నిధులతో అరుంధతి కల్యాణ మండపం నిర్మాణ పనులు ప్రారంభించారు. ✦ గోడలు, పైకప్పు పూర్తిచేయగా వంటగది, డైనింగ్ హాల్, మూత్రశాలలు, ప్రహరీ తదితర పనులకు నిధుల కొరత వేధిస్తోంది. ✦ క్రీడాకారుల్లో నైపుణ్యాలు వెలికితీసేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనకాలే ఉన్న మినీ స్టేడియం ఆధునికీకరణకు రూ.1.50 కోట్లు మంజూరవగా నాలుగేళ్లుగా అసంపూర్తి పనులే వెక్కిరిస్తున్నాయి. ✦ ఇండోర్ భవనం అర్ధాంతరంగా నిలిపివేయగా మైదానంలో ఎలాంటి సౌకర్యాలు లేకుండాపోయాయి. ✦ ఎస్సీ బాలుర వసతిగృహ సమీపంలోని ఊర చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా సుందరీకరించేందుకు రూ.1.80 కోట్ల నిధులతో పనులు చేపట్టినా పూర్తి కాలేదు. ✦ బెంచీలు, ఆకాశదీపాలు ఇతర సౌకర్యాల కల్పనకు నిధులు లేవు.

అర్ధాంతరంగా ఆగిన అరుంధతి కల్యాణ మండపం

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద భవనం దుస్థితి

నిలిచిన సముదాయ గదుల నిర్మాణం

✦ ఏకశిలపై కొలువుదీరిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయగుట్టను ఆనుకొని భక్తుల సౌకర్యార్థం రూ.కోటి నిధులతో సముదాయపు గదుల భవన నిర్మాణాన్ని చేపట్టారు. నిధులు సరిపోక అది అసంపూర్తిగా మారింది. ✦ పూర్తి చేసేందుకు మరిన్ని నిధులు అవసరం కాగా రెండేళ్లుగా ఎదురుచూపులే మిగిలాయి. కొన్ని అభివృద్ధి పనులకు పూర్తయిన దశ వరకు నిధులు రాకపోవడం, మరికొన్నింటికి అదనపు నిధులు అవసరం కాగా ఎప్పటికీ మంజూరవుతాయో తెలియని దుస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి: ఎమ్మెల్యే

దుబ్బాక, మిరుదొడ్డి, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో దుబ్బాక మండలం హబ్షీపూర్ మహాత్మా జ్యోతిబా పులే బీసీ గురుకుల బాలుర పాఠశాల మైదానంలో నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, ఎంఈవో ప్రభుదాస్‌తో కలిసి ఆయన క్రీడా జ్యోతి వెలిగించి, ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.38 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దుబ్బాక పురపాలిక ఛైర్‌పర్సన్ శ్రీరాం సంగీత, సర్పంచి శ్రీలత, హెచ్‌ఎంలు, పీడీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మహిళా సాధికారతకు స్వయం సహాయక సంఘాలు, సమైక్య భవనాలు ఎంతగానో దోహదపడతాయని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లిలో బక్కి వెంకటయ్యతో కలిసి మహిళా సమైక్య భవనం, పాఠశాల ప్రహరీ పనులు ప్రారంభించారు. అనంతరం జలభాండాగారం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఏఎంసీ ఛైర్మన్ తదితరులున్నారు.

బస్సుల్లో రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తున్నారంటూ ఆగ్రహం

చిట్టాపూర్ వద్ద ఆర్టీసీ బస్సులు ఆపి ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

దుబ్బాక, న్యూస్‌టుడే: పండగ వేళల్లో ప్రత్యేక(స్పెషల్) బస్సుల పేరుతో ఆర్టీసీ రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తోందంటూ కొందరు ప్రయాణికులు 765డీజీ జాతీయ రహదారిపై బస్సులను నిలిపి, ఆందోళన నిర్వహించిన ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్ శివారులో సోమవారం జరిగింది. మెదక్ డిపోకు చెందిన ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సు సిద్దిపేట నుంచి మెదక్ వెళుతుండగా పురుష ప్రయాణికుల నుంచి రెట్టింపు ఛార్జీలు వసూలు చేశారు. దీంతో వారు కండక్టర్‌ను నిలదీశారు. చిట్టాపూర్ వద్ద బస్సును నిలిపివేయించి రహదారిపై ఆందోళన చేశారు. ఆ మార్గం గుండా వచ్చే పలు ఆర్టీసీ బస్సులను ఆపడంతో రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న భూంపల్లి పోలీసులు అక్కడికి చేరుకొని ప్రయాణికులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పోలీసులు మెదక్ డిపో సిబ్బందితో మాట్లాడి సాధారణ ఛార్జీలు మాత్రమే తీసుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ప్రయాణికులు ధర్నా విరమించారు.

2, 3 తేదీల్లో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు

మిరుదొడ్డి, మద్దూరు: గ్రామీణ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు దోహదపడతాయని మిరుదొడ్డి, మద్దూరు ఎంఈవోలు ప్రవీణ్‌బాబు, వరదరాజులు పేర్కొన్నారు. ఈ నెల 2, 3 తేదీలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయన్నారు.

కాంగ్రెస్ మోసాన్ని ప్రజల్లో ఎండగడదాం: వొడితల

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్, న్యూస్‌టుడే: ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మోసాన్ని ప్రజల్లో ఎండగడదామని, భారాస చేపడుతున్న పోరాటాన్ని బలోపేతం చేద్దామని మాజీ శాసనసభ్యుడు వొడితల సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం హుస్నాబాద్‌లోని భారాస కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు జరిగిన అన్యాయం, హామీల అమలులో జాప్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటమే భారాస లక్ష్యమన్నారు. సెప్టెంబరు 2 నుంచి వారం రోజుల పాటు నియోజకవర్గంలోని ప్రతి పురపాలిక, మండలం, గ్రామం, వార్డు స్థాయిలో వినూత్న నిరసనలు చేపడతామన్నారు. సమావేశంలో జడ్పీ మాజీ ఛైర్మన్ సుధీర్‌కుమార్, జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఏడు మండలాల భారాస అధ్యక్షులు పాల్గొన్నారు.

సామాజిక సేవతో వెలకట్టలేని సంతృప్తి: సుధాకర్‌రెడ్డి

చేర్యాల, న్యూస్‌టుడే: సామాజిక సేవ చేయడంలో ఉన్న తృప్తి వెలకట్టలేనిదని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఎన్.సుధాకర్‌రెడ్డి అన్నారు. క్లబ్ చేర్యాల శాఖ కోశాధికారి బెజుగం కొండయ్య సొంత డబ్బులతో స్థానిక పోలీసు స్టేషన్ కూడలి సమీపంలో నిర్మించిన బస్టాండును సోమవారం ఆయన ప్రారంభించారు. స్థానికంగా బస్సుల కోసం ఎండలో ఎదురుచూడటం ప్రయాణికులకు ఇబ్బందిగా ఉండటంతో పట్టణ ప్రజల విజ్ఞప్తి మేరకు బెజుగం రాములమ్మ- మల్లేశం జ్ఞాపకార్థం రూ.3లక్షల వ్యయంతో దీన్ని నిర్మించినట్లు చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి పనులు చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లబ్ చేర్యాల అధ్యక్షుడు వీరబత్తిని సత్యనారాయణ, క్లబ్ ప్రతినిధులు డా.సీహెచ్ శ్రీనివాస్, ముస్త్యాల బాలనర్సయ్య, పురాధ్యక్షురాలు ముస్త్యాల అరుణ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సిద్దిపేట	9963585053
జగదేవపూర్	8008573209
హుస్నాబాద్	8008573520
దుబ్బాక	9030037175
చేర్యాల	8008574871
గజ్వేల్	9490675047

(10AM TO 1 PM)

గజ్వేల్, న్యూస్‌టుడే: ? ఆర్‌అండ్‌ఆర్‌కాలనీ పల్లెపహాడ్‌లో పంపిణీ చేసిన స్మార్ట్ రేషన్‌కార్డుల్లో ఊరుపేరు లేదు. అన్నింటిలో ముట్రాజ్‌పల్లి అని వచ్చింది. మాఊరు పేరు తొలగించారు. ఊరి పేరు వచ్చేలా చేయండి. – రమేశ్, పల్లెపహాడ్

✓ సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. – గణేశ్‌రెడ్డి, పుర కమిషనర్ గజ్వేల్

? ముట్రాజ్‌పల్లి వద్ద రోడ్డు పక్కన మురుగు కాలువ లేక నీరంతా పారుతూ దుర్వాసన వస్తోంది. విపరీతంగా దోమలు వస్తున్నాయి. కాలువ నిర్మించి సమస్య పరిష్కరించాలి. – ఎల్లేశం, ముట్రాజ్‌పల్లి

✓ బల్దియాలో ప్రాధాన్య క్రమంలో మురుగు కాల్వల నిర్మాణం చేయిస్తున్నాం. త్వరలోనే ముట్రాజ్‌పల్లిలోనూ నిర్మించి సమస్య పరిష్కరిస్తాం. – చందన, పురాధ్యక్షురాలు గజ్వేల్

చేర్యాల, న్యూస్‌టుడే: ? కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం ఎదురుగా ఉన్న కోనేరు పరిసరాలు బురదమయమై ఇబ్బంది పడుతున్నాం. బురదలోంచి కోనేరులోకి వెళ్లాల్సి వస్తోంది. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలి. ధర్మగుండం పవిత్రతను కాపాడాలి? – శ్రీనివాస్, భక్తుడు, హైదరాబాద్

✓ వర్షం పడినప్పుడు నీరు నిలుస్తుంది. ఇక నుంచి అలా నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. – సుధాకర్‌రెడ్డి, ఈవో, కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొత్త విద్యుత్తు లైన్లు వేస్తున్నందున నేడు(మంగళవారం) విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్తు ఏఈ తెలిపారు. కరీంనగర్ రోడ్డు ఆసుపత్రి నుంచి సబ్‌స్టేషన్ వరకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు, మోడల్ స్కూల్, జీఆర్ రెడ్డి కాలనీ, నేతాజీ నగర్ నుంచి క్రషర్ ఏరియా వరకు మధ్యాహ్నం 12గంటల నుంచి 2 వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

బల్దియా అభివృద్ధే లక్ష్యం

గజ్వేల్, న్యూస్‌టుడే: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బల్దియా అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని ఛైర్‌పర్సన్ చందన అన్నారు. ఆమె అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. డంపింగ్ యార్డులో పెండింగ్ పనులతో పాటు, దినసరి కూలీలను నియమించడం, పలుచోట్ల జేసీబీతో చదును పనులు చేయించాలని తీర్మానం చేశారు.

పాత స్థలంలోనే కూరగాయల మార్కెట్

ములుగు, న్యూస్‌టుడే: ములుగు మండలం వంటిమామిడి కూరగాయల మార్కెట్ వద్ద ప్రతిరోజు ఉదయం సంత జరుగుతోంది. ఇది రాజీవ్ రహదారికి ఆనుకొని ఉన్న నాలుగు ఎకరాల స్థలంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆరు జిల్లాల రైతులు, వ్యాపారులు తరలివచ్చి క్రయవిక్రయాలు చేస్తుంటారు. ఫలితంగా రహదారి మొత్తం ట్రాఫిక్‌తో నిండిపోతోంది. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న చిరుజల్లులకు కొత్తగా ఏర్పాటుచేసిన మార్కెట్ స్థలం బురదగా మారింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆగస్టు 30న 'కూరగాయల సంత.. బురదతో చింత' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మార్కెటింగ్ శాఖ అధికారులు, పాలకవర్గ సభ్యులు స్పందించారు. పాత మార్కెట్ స్థలంలోనే సోమవారం సంత నిర్వహించడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు కథనానికి స్పందన

భగీరథ గేట్‌వాల్వుకు నాచు తొలగింపు

కోహెడ, న్యూస్‌టుడే: కోహెడ నుంచి తంగళ్లపల్లి వెళ్లే దారి పక్కన మిషన్ భగీరథ గేటువాల్వ్‌కు పేరుకుపోయిన నాచును సంబంధిత అధికారులు తొలగించారు. గత సోమవారం (ఆగస్టు 24న) 'భగీరథ నీరు.. నాచుతో బేజారు' శీర్షికతో 'ఈనాడు'లో ఫొటో వార్త ప్రచురితం కాగా అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు. మిషన్ భగీరథ ఏఈ రాజకుమార్ సిబ్బందికి సూచించడంతో శుభ్రపరిచారు.

కొండపోచమ్మ ఆలయ ఈవోగా మైసయ్య

జగదేవపూర్: కొండపోచమ్మ ఆలయ ఈవోగా మూషణం మైసయ్య సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ ఈవోగా పనిచేసిన రవికుమార్ గతంలో ఉద్యోగ విరమణ చేశారు.

EENADU Classifieds

REAL ESTATE

LAND FOR SALE

జనగాం- హుస్నాబాద్ హైవే దగ్గరలో 1.35 ఎకరం ఎర్ర నేల తూర్పు ఫేసింగ్‌తో 600ft పొడవు 150ft వెడల్పుతో బోర్ & జాలీ ఫెన్సింగ్‌తో అమ్మబడును. పౌల్ట్రీ ఫామ్స్/ ఏ ఫామ్ కైనా/ఏ తోటకైనా అనుకూలం. ✆ 8019095973.

JOBS

రాఘవ అసెట్ ఫైనాన్స్ Pvt. Ltd లో బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ Sdpt-2, దుబ్బాక-2, ప్రజ్ఞాపూర్-2, హుస్నాబాద్-2. సెల్: 91009 02181, 82

క్లాసిఫైడ్ ప్రకటనలకు సంప్రదించండి: 9000014771

MARKETING/ SALES

రియల్ ఎస్టేట్ శాలరీ బేస్ మార్కెటింగ్ డైరెక్టర్ కావలెను. స్మార్ట్ సిటీ, జహీరాబాద్ NIMZ 5KM, రే. 3,50,000/- ప్లాట్, EMI, స్పా. రిజి. Sal+inc= 50K ✆ 9281447559

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

శంభులింగేశ్వరుడికి విశేష పూజలు

వర్గల్, న్యూస్‌టుడే: వర్గల్‌లోని శంభులింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. అతిపురాతనమైన అన్నపూర్ణ సమేత శంభులింగేశ్వర స్వామికి ఆలయ అర్చకుడు వీరభద్రయ్య ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

హుస్నాబాద్, హుస్నాబాద్ గ్రామీణం, కోహెడ, బెజ్జంకి, మద్దూరు, నంగునూరు, కొండపాక, కొండపాక గ్రామీణం, చిన్నకోడూరు, దౌల్తాబాద్, న్యూస్‌టుడే: జిల్లాలోని డివిజన్, మండల స్థాయిలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. హుస్నాబాద్ డివిజన్‌లో 3, కోహెడలో 17, బెజ్జంకిలో 5, మద్దూరులో 3, నంగునూరులో 10, కొండపాకలో 11, కుకునూరుపల్లిలో 8, చిన్నకోడూరులో 3, హుస్నాబాద్ 7, అక్కన్నపేటలో 0, దౌల్తాబాద్‌లో 1 చొప్పున అర్జీలు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

'మల్లయుద్ధం' విజేతకు అభినందన

కార్తీక్‌తో ప్రిన్సిపల్ సునీత, సంపత్‌కుమార్

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేట స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్, బీఎస్సీ ప్రథమ సంవత్సర విద్యార్థి ఆడెపు కార్తీక్ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి మల్లయుద్ధం పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. సంబంధిత వివరాలను ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ అధికారి ప్రొ.సంపత్‌కుమార్ సోమవారం వెల్లడించారు. విద్యార్థి స్వస్థలం తుర్కపల్లి కాగా బాల్యం నుంచే ఆసక్తితో రాణిస్తున్నారని, ఎస్టీ నారాయణ రెజ్లింగ్ క్లబ్ ద్వారా నైపుణ్యాలను మెరుగుపర్చుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సునీత, అధ్యాపకులు అభినందించారు.

పురపాలక సిబ్బంది 'ఆట'విడుపు

హుస్నాబాద్‌లో క్రీడల్లో పాల్గొన్న మహిళా కార్మికులు

సిద్దిపేట, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని సిద్దిపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందికి సోమవారం వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. స్థానిక క్రీడా మైదానంలో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బల్దియా కమిషనర్ మల్లికార్జున్ సరదాగా క్రికెట్ ఆడారు. క్రీడలను దినచర్యలో భాగంగా మార్చుకోవాలన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్‌ను ప్రతి ఒక్కరు స్మరించాలన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

హుస్నాబాద్, న్యూస్‌టుడే: సోమవారం స్థానిక పుర కార్యాలయ ఆవరణలో క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు పురాధ్యక్షురాలు దండి లక్ష్మి, ఉపాధ్యక్షురాలు చిత్తారి పద్మ ట్రోఫీలు అందజేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిరంతరం సేవలందిస్తున్న మహిళా కార్మికులను ప్రోత్సహించడానికి పోటీలు నిర్వహించామన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

108 వాహనం ఆకస్మిక తనిఖీ

బెజ్జంకి, న్యూస్‌టుడే: బెజ్జంకి క్రాసింగ్ రాజీవ్ రహదారిపై 108 వాహనాన్ని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సంపత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఎంటీ రాజు, పైలట్ రాజమల్లు పాల్గొన్నారు.

అమ్మను తలిచి.. భక్తితో కొలిచి

మద్దూరు: రేబర్తిలో ఆదివారం రాత్రి కురుమసంఘం ఆధ్వర్యంలో ముత్యాలమ్మ, పోచమ్మ తల్లులకు ఫలహార బండ్ల ఊరేగింపు కనులపండువగా సాగింది. పోతరాజులు, ఒగ్గు కళాకారుల విన్యాసాలతో ఆలయానికి చేరుకొని అమ్మవార్లకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఐటీఐలో తక్షణ ప్రవేశాలు

సిద్దిపేట అర్బన్: సిద్దిపేట గ్రామీణ మండలం ఇర్కోడులో గల ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఉంది. 2026-27 విద్యా సంవత్సరానికి గానూ ఈనెల 1 నుంచి 5వ వరకు తక్షణ ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ రామానుజ తెలిపారు.

బడుల్లో సమస్యలు పరిష్కరించరూ!

గజ్వేల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందెబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సోమవారం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గజ్వేల్ డివిజన్ పరిధిలో చాలా పాఠశాలల్లో కనీస సదుపాయాలు లేవన్నారు.

పోషకాహార ప్రదర్శన.. మంత్రి అభినందన

కట్కూర్‌లో పండ్లు, కూరగాయలు, పప్పులు, కోడిగుడ్లతో ప్రదర్శన

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: పండగకు వేసిన ముగ్గులా ఉన్న ఈ చిత్రం పోషకాహార ప్రాముఖ్యతను తెలిపే ప్రదర్శన. ఈ నెల 1 నుంచి 'పోషణ మాసోత్సవ్' నిర్వహించనున్న నేపథ్యంలో అక్కన్నపేట మండలం కట్కూర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు దీనిని రూపొందించారు. తల్లీబిడ్డల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన వివిధ రకాల పప్పులు, కూరగాయలు, పండ్లు, బియ్యం, కోడిగుడ్లు తదితర ఆహార పదార్థాలతో ముగ్గు మాదిరిగా అలంకరించారు. దీనిని మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించి అంగన్‌వాడీ టీచర్లను అభినందించారు. తల్లీబిడ్డల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఈ ప్రదర్శన నిర్వహించినట్లు సీడీపీవో సుశీల మంత్రికి తెలిపారు.

150 సంచుల రేషన్ బియ్యం పట్టివేత

నంగునూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిల్వ చేసిన 150 సంచుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రాజగోపాలపేట ఎస్‌ఐ టి.వివేక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. నంగునూరు మధిర గ్రామం రామచంద్రపురంలోని మోతె సాయితరుణ్ ఇంటి ఆవరణలో రేషన్ బియ్యం అక్రమంగా పెద్దఎత్తున నిల్వ చేసినట్లు పోలీసులకు సోమవారం ఉదయం సమాచారం అందింది. వెంటనే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, రాజగోపాలపేట పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, వాటిని పౌరసరఫరాల శాఖకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థుల భద్రతకు సీసీ కెమెరాలు కీలకం

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: అసాంఘిక కార్యకలాపాలను నివారించడంలో సీసీ కెమెరాలు కీలకమని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యురాలు మరికంటి భవాని తెలిపారు. సోమవారం కొండపాక మండలం మర్పడ్గలోని ప్రాథమిక పాఠశాలలో హైదరాబాద్‌కి చెందిన మిలాన్ గ్రూప్ అధినేత అజీముద్దీన్ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సర్పంచి ఆకారం బాలరాజుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల భద్రతకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా ఆమెను నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో దాత అజీముద్దీన్, ఏవో శివరామకృష్ణ, మండల నోడల్ అధికారి పెద్ది విఠల్, ప్రధానోపాధ్యాయులు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

విహారానికి సహకారం

☛ పిల్లలకు మానసికోల్లాసం కలిగించేందుకు సర్కారు నిర్ణయం

నెహ్రూ జంతుప్రదర్శనశాల వద్ద పిల్లలతో ఐఈఆర్పీలు

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు మానసికోల్లాసం కలిగించేందుకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. వారిని విహారయాత్రలకు తీసుకువెళ్లడంతో పాటు క్రీడా పోటీలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు సమగ్ర శిక్ష ద్వారా నిధులు మంజూరయ్యాయి. శారీరక, మానసిక వైకల్యం కలిగినవారు, తక్కువ దృష్టి, వినికిడి లోపం ఉన్న పిల్లలు ఇతర పిల్లల మాదిరిగా విహారయాత్రలకు వెళ్లలేరు. అలాంటి వారి పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం వారిపై దృష్టి సారించింది. ఈ మేరకు జిల్లా అధికారులు వారిని విహారయాత్రలకు తీసుకువెళ్లడం, వారు ఆడగలిగే ఆటల పోటీలు నిర్వహించేందుకు కార్యాచరణ తయారు చేస్తున్నారు.

రూ.2 లక్షల చొప్పున నిధులు

✦ జిల్లా వ్యాప్తంగా మండలానికి ఒకటి చొప్పున 26 భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సుమారు 2 వేల మంది పిల్లలు ఉండగా వారికి చదువు నేర్పడంతో పాటు సేవలందించేందుకు 26 మంది ఐఈఆర్పీలు పని చేస్తున్నారు. ✦ వీరు పిల్లలను ఆటలాడిస్తూ చదివిస్తున్నారు. చాలా మంది ఊరు విడిచి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో మానసిక ఉల్లాసానికి దూరం అవుతున్నారు. ✦ ఈ లోటును తీర్చేందుకు ప్రభుత్వం జిల్లాకు రూ.2లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. జిల్లాకు వచ్చిన నిధులతో ఈ నెల 18న పిల్లలను ఒకరోజు విహారయాత్రలో భాగంగా హైదరాబాద్‌కు తీసుకువెళ్లారు. ✦ పిల్లలతో పాటు సంరక్షణ కోసం వారి తల్లిదండ్రులను కూడా ప్రత్యేక వాహనాల్లో తీసుకువెళ్లారు. అక్కడ నెహ్రూ జంతు ప్రదర్శనశాలతో పాటు పలు ప్రదేశాలను చూపించారు. ✦ వారికి అవసరమైన ఆహారం, వసతి, మందులు సమకూర్చారు. ఈ యాత్ర పట్ల పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్ రంగనాథ్ తెలిపారు. ✦ క్రీడల నిర్వహణకు మండలానికి రూ.5వేల చొప్పున నిధులు వచ్చాయని, వాటితో మండల, జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించాలని ఎంఈవోలకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

తెరసేతోనే సామాజిక న్యాయం : కొట్టాల

గజ్వేల్, న్యూస్‌టుడే: సామాజిక న్యాయం తెరసేతోనే సాధ్యమని కొట్టాల యాదగిరి సోమవారం గజ్వేల్‌లో అన్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీ ఏర్పాటు చేసినప్పటి నుంచి అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సమస్యలపైనే పోరాటం చేస్తున్నామన్నారు.

వర్గల్, న్యూస్‌టుడే: నాచగిరి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదని తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ గజ్వేల్ నియోజకవర్గ బాధ్యుడు కొట్టాల యాదగిరి అన్నారు. సోమవారం స్వామివారిని దర్శించుకొని మాట్లాడారు.

బోధనా రుసుముల బకాయిలు చెల్లించండి

సిద్దిపేట అర్బన్: పెండింగ్‌లో ఉన్న బోధనా రుసుములను వెంటనే విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఫణీందర్, ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సదన్ మహారాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ హరికిరణ్‌కు ఫణీందర్, కలెక్టరేట్‌లో సదన్ మహరాజ్ వేర్వేరుగా వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచడమేమనగా కుమారి యష్మీన్ సానియా తండ్రి మొహమ్మద్ అబ్దుల్ వసీమ్, నివాసం హైదరాబాద్ గారి వద్ద వారి యొక్క ఆస్తి అనగా రిజిస్టర్ విక్రయ దస్తావేజు నం.6044/2021 మరియు రిజిస్టర్ క్రయ ఒప్పందల దస్తావేజు నం.7296/2022 సబ్ రిజిస్టర్ కార్యాలయం, సిద్దిపేట ద్వారా సంక్రమించిన సిద్దిపేట జిల్లా మరియు పట్టణం (పాత గ్రామ పంచాయతీ ప్రశాంత్‌నగర్)లో గల సర్వే నం.1297 లోని ప్లాట్ నం.లు A 7 మరియు A 8 పిటి మొత్తం విస్తీర్ణం 400-00 చ.గ.లు, హద్దులు తూర్పు: ప్లాట్ నం. B1, పడమర: 24 ఫీట్ల రోడ్డు, ఉత్తరం: 30 ఫీట్ల రోడ్డు మరియు దక్షిణం: ప్లాట్ నం.A 9 గాగల ఆస్తిని నా క్లయింట్లు అగు శ్రీ A.శ్రవణ్ కుమార్ తండ్రి బలేని, నివాసం బెజ్జంకి గారు ఖరీదు చేసి విక్రయ ఒప్పందం కుదుర్చుకుని అడ్వాన్స్ డబ్బులు కూడా చెల్లించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి ఆక్షేపణలు ఉన్న వారు ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి ఏడు దినములలోగా తగు దస్తావేజులతో నా కార్యాలయంలో సంప్రదించగలరు లేనిచో తదుపరి ఎవరి ఆక్షేపణలు చెల్లనేరవు.

కె.సాయి నారాయణ, అడ్వకేటు
ఇం.నం.4-3-8, పటేలపుర వీధి, సిద్దిపేట-502103
సెల్ నం: 9848319114

(c) eenadu